# పాట్లు

ఆనందరావు- పంకజాక్షి భార్యాభర్తలు. వీళ్ళకో అబ్బాయి. పేరు నవీన్. అబ్బాయికిప్పుడు మూడో సంవత్సరం వచ్చింది.

''బాబుని కాన్వెంటులో జాయిన్ చేసేస్తాను' అన్నాడు ఆనందరావు.

''వేసేస్తాను అని నానుస్తారేమిటండీ? మూడో సంవత్సరం రాకముందే అందరూ చేర్పించేస్తుంటేనూ'' అంది పంకజాక్షి.

''మీ తెలివి తెల్లారినట్లే వుంది. అయిదో సంవత్సరం రానివ్వండ్రా.. అడుగులు వెయ్యడం రాకముందే పరుగులు పెట్టమన్నట్టుంది'' మూలనున్న బామ్మ మూలుగుతూ అంది.

''పూర్వం రోజులు కాదు. నువ్వూరుకో బామ్మా'' ఆనందరావు విసుక్కున్నాడు.

''బాబుని కాన్వెంటులో వెయ్యమంటే మీరడ్డు చెప్తారు. నేను ఉద్యోగం చేస్తానంటే ఆయనడ్డు చెప్తారు. బాగానే వుంది'' మూతి మూడు తిప్పులు తిప్పి యింట్లోకి నడిచింది పంకజాక్షి.

''నేను చెప్పింది ఏనాడు చెవికెక్కింది గనుక. నామకరణానికి కూడా నలభైమందిని వాకబు చేసిన ఘనుడివి. ఇతరులు చెప్పిందేగానీ నీకై ఏదీ తోచదుగా! నడకరానివాడ్ని, విమానం నడపమన్న రోజులు'' బామ్మ ఏకరువు పెట్టింది.

ఆనందరావు టైము చూసుకుని ఆఫీసుకి బయల్దేరాడు.

రెండ్రోజులు గడిచాయి.

'భ్రాంతి' కాన్వెంటుకి వెళ్ళాడు ఆనందరావు. బాబుకి కాన్వెంటులో సీటు అడిగాడు.

''ముందుగా పేరంట్స్ టెస్ట్ పాసయితే అప్పుడు బాబుకి కాన్వెంటులో సీటు'' చెప్పారు.

ఆనందరావు ఆశ్చర్యపోయాడు. ''నలుగురితో నారాయణ, గుంపులో గోవింద '' అనుకుని ''టెస్ట్ పెట్టండి సార్!'' అన్నాడు.



''మా కాన్వెంటు చాలా స్ట్రిక్ట్. అందుకే అందరూ కాళ్ళరిగేలా తిరుగుతారు. మీకొక ప్రశ్న -అందరికీ మామ ఎవరు?'' అడిగాడు కరస్పాండెంట్ కనకారావు.

''అందరికీ మామ చందమామ'' ఠక్కున చెప్పాడు ఆనందరావు.

''వెరీగుడ్. మేము తెలుగు కూడా నేర్పుతాము అనడానికి ఇదో ఉదాహరణ. ఇక ఫీజు విషయం. నెలకి ఎనిమిదొందలు'' అని కనకారావు చెప్పేసరికి.

''ఏమిటి నెలకి ఎనిమిదొందలా?'' ఆశ్చర్యపోయాడు ఆనందరావు.

''ఎందుకంత ఫీజని మీ బాధ. కంప్యూటర్ నేర్పుతాము. ఆధునికమైన ఆటలు వగైరా..వగైరా'' కనకారావు చెప్పుకుపోతున్నాడు.

చెప్పాపెట్టకుండా ఆనందరావు తన యింటికి నడిచాడు.

వచ్చిన భర్తని- ''ఏమండీ బాబుకి కాన్వెంటులో సీటు వచ్చిందా?'' గుమ్మంలో నుండే అడిగింది పంకజాక్షి.

''ఈ సంవత్సరం వెయ్యను. వచ్చే సంవత్సరం వాడ్ని స్కూలులో వెయ్యడం, నిన్ను ఉద్యోగానికి పంపించడం చేస్తాను'' ఆనందరావు అనేసరికి, పంకజాక్షి సంతోషానికి అవధుల్లేవు.

''వచ్చే సంవత్సరం నేనే స్కూలు పెట్టి విద్యాదానం చెయ్యాలని నా సంకల్పం. విద్యని వ్యాపారం చేస్తున్న ఈరోజుల్లో మనలాంటి వాళ్ళు ముందుకు నడవాలి. మన స్కూలులో నువ్వే కరస్పాండెంట్, మన బాబు మొదటి విద్యార్థి'' ఆనందరావు నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యమయింది.

''పసిపిల్లాడి ఆటల ధ్యాస కూడా తీరుతుంది'' ఆనందపడుతూ అంది బామ్మ.

-సిహెచ్.డి. లక్ష్మణరావు
(విజయనగరం)




